# తిరుగుబాటు

భైరవయ్య సోఫాలో చేరబడి, ఆ రోజు న్యూస్‌పేపరు చదువుకుంటున్నాడు. అతను కూర్చున్న డ్రాయింగు రూము గోడలకి రాజకీయ నాయకుల ఫోటోలతో పాటు, కొందరు దేవుళ్ళ ఫోటోలూ వున్నాయి. సోఫాకి వెనుకవేపు గోడకి ఆనుకుని అద్దాల కప్‌బోర్డు వుంది. అందులో రకరకాల రంగు బొమ్మలు తీర్చిదిద్దినట్టుగా అందంగా అగుపిస్తున్నాయ్. మరోపక్క పెడస్టల్ ఫేనూ దాని పక్కనే యెత్తయిన టేబిలుమీద ఫోనూ వున్నాయ్. ఇవన్నీ చూస్తుంటే అతను బాగా డబ్బున్న వాడని యిట్టే అర్థమైపోతుంది. అయితే, అతను డబ్బున్న వాడేగాని, పిల్లిక్కూడా బిచ్చం పెట్టని పరమ పిసినారి. అంతటి పిసినారి గాబట్టే, డబ్బు సంపాదించగలిగాడంటారు. కొందరు. అది నిజమే కావచ్చు. తన ఆస్తిపాస్తుల్ని అంచెలంచెలుగా పెంచుకు పోవాలన్న తపనే తప్పించి, అవసరమున్న వాళ్ళని ఆదుకోవాలన్న ఆలోచన, అతనికి యేకోశానా లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

భైరవయ్యకి, యిద్దరు సంతానం. వాళ్ళిద్దరూ కొడుకులే. తనకి కూతుళ్ళు లేకపోవడం ఓ అదృష్టంగా భావిస్తాడు భైరవయ్య. అందుకు గర్విస్తాడు కూడాను. ఎందుకూ అంటే, కట్నం రూపేణా కానుకల రూపేణా తాను యెవ్వరికీ యేమీ ఇవ్వనవసరం లేదని, ఎవ్వరికీ తలవంచడమన్నది తన జీవిత కాలంలో ఉండదని, అందుకేనేమో అతని ప్రవర్తలోనూ మాటల్లోనూ నిర్లక్ష్యపు ఛాయలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

టెలిఫోను, మోగింది. ఆ గదిలోని నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ చదువుతున్న దినపత్రికని టీపాయ్‌మీద పెట్టి ఆతృతగా వెళ్ళి రిసీవర్ని చేతిలోకి తీసుకున్నాడు భైరవయ్య. హాస్పిటల్ నుంచి కొడుకు ఫోను కోసం ఎదురు చూస్తున్నాడు. అందుకే ఆ ఆతృత!

"హలో... హలో... ఎవరూ? ఓ.. నువ్వ ట్రా గోపాలం! నీ ఫోను కోసమే యెదురు చూస్తున్నాన్రా. ఏవిఁటి సంగతి? మీ ఆవిడ ప్రసవించిందా? ఆఁ... అలాగా? సంతోషంరా. అబ్బాయేనా? నాకు తెలుసు... ఆఁ... ఎవిఁటీ? కాదా! అమ్మాయా? ఛీ! దౌర్భాగ్యుడా! ఈ వెధవ కబురు చెప్పడానికేనా

నువ్వు ఫోను చేశావు! సిగ్గులేదట్రా నీకు? తల్లీ, పిల్ల, మొహం చూడకుండానే వెంటనే నువ్వు వచ్చేయ్. ఛీ ! ఛీ ! మొదటి బిడ్డా ఆడపిల్లే ! రెండోది ఆడపిల్లేనా? ఏవిఁటీ? ఆవిడేం చేస్తుందా? అదంతా మనకి అనవసరం. నేనేమీ వినను. వున్నపాటున నువ్వు వచ్చేయ్..'' అనేసి దభేలున ఫోను పెట్టేశాడు భైరవయ్య. అతని మొహం కోపంతో ఎర్రబారింది.

భైరవయ్యది నడమంత్రపుసిరి. దూరపు బంధువు ఆస్తి కలిసిరావడం వల్ల హఠాత్తుగా గొప్పవాడైపోయాడు. అందుకేనేమో విర్రవీగి పోతూ వుంటాడు. అతని భార్య తులశమ్మ కూడా ఆయనకేవీఁ తీసిపోదు. అన్నీ భర్త గుణగణాల్నే పుణికి పుచ్చుకుంది.అదే ఆ దంపతుల ప్రత్యేకత!

"తులసీ... తులసీ...'' భార్యని కేకవేసాడు భైరవయ్య.

భర్త పిలుపు వినగానే, ఆత్రంగా లోపల్నుంచి వచ్చింది తులశమ్మ.

"ఏఁటండీ ఫోనోచ్చిందా?'' అంది వస్తూనే.

"ఆఁ ! వచ్చింది.. '' ముక్తసరిగా అన్నాడు.

" కోడలు ప్రసవించిందా?'' ఆసక్తిగా అడిగింది.

"ఆ! ప్రసవించింది'' వెటకారంగా అన్నాడు భైరవయ్య.

"మగబిడ్డేనా? '' మగబిడ్డే అయ్యుంటుదన్న దీమాతో ప్రశ్నించింది.

"కాదు... ఆడ పిల్ల!'' నొక్కి చెప్తూ అన్నాడు భైరవయ్య.

తులశమ్మ మొహం వివర్ణమయ్యింది. తానూ స్త్రీయే అయినా, ఆమెకీ మనుమరాలు పుట్టడం సంతృప్తికరంగా లేదు. జరగనిదేదో జరిగినట్టుగా ఆశ్చర్యంగా మొహం పెట్టింది.

"ఆ! మళ్ళీ ఆడపిల్లేనా? పింజారి ముండ... మళ్ళీ ఆడపిల్లనే కన్నదా? ఛీ! ఛీ! వాళ్ళిద్దరి మొహాలు చూడకుండా వాణ్ణి వచ్చేయమనలేదూ?'' కళ్ళింతలు చేసుకుని విసురుగా అంది తులశమ్మ. తానూ ఆడదేనన్న యింగితంగాని, ఆడపిల్లల్ని కనడంలో కోడలి భాద్యత యెంతవరకూ వుందోనన్న ఆలోచనగాని ఆమెకు లేకపోయాయి.

"నాకు తెలీదూ? ఆ మాటే వాడికి చెప్పాను లేవే. ఈ సరికి వచ్చేస్తూ వుంటాడు. మన మాటంటే వాడికి వేద వాక్యమేకదా ! ముసిముసి నవ్వుతూ అని, మళ్ళీ దినపత్రిక తీసుకున్నాడు భైరవయ్య.

తులశమ్మ యేదో గొణుక్కుంటూ లోపలికి నిష్క్రమించింది.

✪ ✪ ✪

గోపాలం పరిస్థితి అయోమయంగా వుంది. ఈ క్లిష్ట పరిస్థితిని యెలా యెదుర్కోవడమోనన్న ఆలోచనల్లో పడ్డాడు.

గోపాలం భార్య సునంద కుమిలిపో సాగింది. మళ్ళీ తాను ఆడ పిల్లనే కన్నందుకు అత్తారింట్లో అందరూ తనని ఆడిపోసుకుంటారని ఆమెకు తెలుసు. అంతటితో చాలిస్తే ఫరవాలేదు. వాళ్ళ ప్రవర్తన, తన పట్ల తన పిల్లల పట్ల యెలా వుంటుందోనని తల్లడిల్లిపోయింది. పెల్లుబుక్కొస్తోన్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. భవిష్యత్తుని వూహించుకుంటూ బావురుమంది. ఆమె తల్లిదండ్రులు, యెంత నచ్చజెప్పినా, ఆమెకు ధైర్యం చాలడం లేదు. అత్త మామలే కాదు - భర్త కూడా తననే దోషిగా నిలబెట్టి యేహ్య భావంతో ప్రవర్తిస్తాడేమోనని కలవరపడింది అందుకే ఆ ఆవేదన !

అయితే గోపాలం తండ్రి లాంటివాడు కాదు. మాతృమూర్తి బుద్ధులు అతనికి వంటబట్టలేదు. కాలానుగుణంగా మారుతూ మసలుతున్న మనిషి తండ్రి ఫోనులో చెప్పిందంతా విన్నాడే తప్ప దాన్ని అమలుపరచాలన్న ఆలోచనే అతనికి లేదు. అతనికి తెలుసు - యిందులో సునంద తప్పేమీ లేదని, ఆ మాట కొస్తే పిల్లల జన్మకి తల్లిదండ్రులిద్దరూ బాధ్యులైనపుడు ఆడపిల్లని కన్నదని, కేవలం తల్లినే తప్పుబట్టడం కుసంస్కారమనుకున్నాడు గోపాలం. అతని మనస్తత్వానికి అది గీటురాయి.

భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని కుమిలిపోతోన్న భార్య తల నిమిరాడు గోపాలం ఆప్యాయంగా, ఆ స్పర్శయెంతో ఓదార్పునిచ్చింది సునందకి. భర్త చేయిపట్టుకుని రోదించింది. " బాధపడకు సునందా ! ఇప్పుడేమయ్యిందని, అలా విలపిస్తావు ? రెండోసారి కూడా ఆడపిల్లే పుట్టింది. అంతే కదా ? దానికి నువ్వేంజేస్తావు ? అవసరమయ్యే బిడ్డను కనే శక్తి అవకాశం మాతృమూర్తికి వుందా ? లేదే ? ఇదంతా భగవద్విలాసం ! ఈ పరమసత్యాన్ని విస్మరించిన మూర్ఖులే విమర్శిస్తారు. అయినా ఈ రోజుల్లో ఆడపిల్లలయినా, మగపిల్లాడయినా ఒకటే సునందా. తల్లిదండ్రుల్ని గౌరవించని వాళ్ళు పోషించని వాళ్ళు ఎంతమంది కొడుకుల్ని మనం చూడ్డంలేదు ? అంచేత ఆడపిల్లలే నయమంటాన్నేను. మనకి ఇద్దరూ ఆడపిల్లలే అయినందుకు నాకేవీఁ విచారం లేదు సునందా. నువ్వెందుకు కుమిలిపోతావు ?" అంటూ భార్యని అనునయపర్చాడు గోపాలం.

సునందకి భర్త మాటలు అమృతపు జల్లులా తోచినాయి. ఆమె హృదయానికి యెంతో ఉపశమనం కలిగించాయి. ఆమె మొహం విప్పారింది.

" చాలండీ చాలు! ఆ పాటి మీ అభయహస్తం గాయపడిన నా హృదయానికి యెంతో వూరట

కలిగిస్తుందండీ. అయితే, మీ అమ్మ, నాన్న యేమనుకుంటున్నారో, యెలా స్పందిస్తారన్నదే నా భయం!" అంది భీతిల్లుతూ.

చప్పున జవాబు చెప్పలేకపోయాడు గోపాలం. తండ్రి ఫోనులో చెప్పిన మాటల్ని భార్యతో యెలా చెప్పగలడు ? చెబితే ఆమె మరింత కుంగిపోతుందని అతనికి తెలుసు. ఆ పరిస్థితిలో చెప్పకుండా వుండటమే శ్రేయస్కరమనుకున్నాడు.

" అవన్నీ మనసులో పెట్టుకోవద్దు సునందా ! భగవన్నిర్ణయానికి నువ్వేం చేస్తావు ? ఇందులో నీ తప్పు యేముందని కుమిలిపోతావు ? ధైర్యాన్ని కూడగట్టుకో ! ఎటువంటి పరిణామాణ్ణయినా యిద్దరం సంఘటితంగా యెదుర్కుందాం. నువ్వేం అధైర్యపడకు" భార్యకు ఎనలేని మనో నిబ్బరాన్ని అందించాడు గోపాలం.

సునంద భర్త చేతిని ఆప్యాంగా, తృప్తిగా నిమిరింది ఆయన అభయహస్తం నీడలో తనకి యెటువంటి ఇక్కట్లూ రాదన్న నిర్ణయానికొచ్చింది. ఆమె అంతరంగంలో వేయి వసంతాలు వెల్లివిరిసినయ్.

✪ ✪ ✪

గోపాలం ఇల్లు చేరుకున్నాడు. తల్లిదండ్రులు ముభావంగా, గంభీరంగా వుండటాన్ని గమనించాడు. అందుకు హేతువేమిటో అతనికి తెలుసు. అలాగని తానూ గంభీరంగా, ముభావంగా ఓమూల కూచోలేడు కదా !

"పాప అచ్చం నాలాగే వుంటుందమ్మా అన్నాడు తల్లినుద్దేశించి.

" తులశమ్మ తీక్షణంగా కొడుకుకేసి చూసింది. అమె మొహం ఎర్రబారింది కళ్ళు చింతనిప్పులే అయ్యాయి. " సంతోషించాం లేరా ! చెప్పడానికి నీకు సిగ్గనిపించడం లేదూ? మళ్ళీ మీ ఆవిడ ఆడ పిల్లని కన్నందుకు వాళ్ళిద్దరి మొహాల్ని చూడకుండానే వెనక్కి తిరిగి వచ్చేయాల్సింది. మీ నాన్నగారు చెప్పినా సరే, ఆ పని నువ్వు చెయ్యలేదు. పైగా అమ్మాయి నీ పోలికలో వుందని సిగ్గులేకుండా చెబుతున్నావా ?" కోపంగా అంది తులశమ్మ.

భైరవయ్యకి మరీ వొళ్ళు మండిపోతుందేమో చప్పున అందుకున్నాడు.

" నా మాటలకి యేమన్నా విలువిచ్చావా ? ఇద్దరు ఆడ పిల్లల్ని కన్న దాని మొహం చూడ్డమేవిట్రా ? సిగ్గులేదూ ! మనకి ఓ వంశోద్ధారకుణ్ణి కనివ్వలేని కోడలు, యీ ఇంటి కోడలని చెప్పకోడానికి

నాకు సిగ్గుగా వుందిరా. నీకు చీమకుట్టినట్టయినా అనిపించడంలేదూ? ఇదిగో చెబుతున్నాను, సావధానంగా విను. రెండోసారి కూడా ఆడపిల్లనే కన్న నీ భార్యని, పిల్లల్ని మనింటికి తీసుకురావడానికి వీల్లేదు.. అక్కడే వుండనీ, అర్థమయ్యిందా ?" సుమారు గర్జించాడు భైరవయ్య. " అప్పుడు గాని నీ పెళ్ళాం పొగరు అణగదురా అబ్బాయ్ జీవితాంతం దాన్ని కన్నవారింట్లోనే వుండనీ దానికి విడాకులిచ్చేసి లక్షణమైన మరో అమ్మాయిని వివాహంచేసుకుందువుగాని..." భర్తకి వంతపాడింది తులశమ్మ.

గోపాలంకి వొళ్ళు మండిపోయింది. అమ్మ, నాన్న యింత మూర్ఖంగా ఆలోచించినందుకు అతనికి ఆశ్చర్యం కలగలేదు. ఎందుకూ అంటే ఆడపిల్లలంటే వాళ్ళకి మొదట్నుంచీ యేహ్యాభావమే. ఏ ఆడపిల్లనీ వాళ్ళు ఆప్యాయంతతో ప్రేమతో చేరదియ్యరు. అంతెందుకు? తన పెద్ద కూతుర్ని కూడా తండ్రి యేనాడూ ఆప్యాంగా, లాలనగా ప్రేమగా చేరదియ్యడం తనెప్పుడూ చూళ్ళేదు. ఆయనంటే మగాడు. కాని, తానూ ఓ స్త్రీ జన్మనెత్తిన తన తల్లి తన పెద్దకూతుర్ని ముద్దుగా పిలవడం, చేరదియ్యడం, అంతంత మాత్రమే. మనసులో లేని మమత యెక్కణ్ణించి వస్తుందని, తనే సర్దుకు పోతూ వుంటాడు. అటువంటి వ్యక్తులు తన రెండో కూతుర్ని ఆనందంతో ఆహ్వానిస్తారని అనుకోవడం తను తెలివి తక్కువతనమనుకున్నాడు గోపాలం. తల్లిదండ్రుల పట్ల వుండే గౌరవభావం పలుచబడింది. తల్లికేసి సూటిగా చూశాడు. అతని కళ్ళల్లో ఆవేశపు నీడలు అగుపిస్తున్నాయి.

"మీరు మనషులో, మానవ రూపాల్లో వున్న రాక్షసులో అర్థం కావడంలేదమ్మా ! మీలో మానవత్వ మన్నది యేకోశాన్నయినా వుందా అన్న అనుమానం కలుగుతోంది. నాన్నంటే మగాడు ! అయనకు ఆడపిల్లలు లేరుగాబట్టి వాళ్ళ గురించి తెలీదు. పైగా, ఆయన వట్టి డబ్బు మనిషి, ఆడ పిల్లలుంటే వాళ్ళకు పెళ్ళి చేయాల్సిన బాధ్యతతో పాటు భారీగా కట్నకానుకల కోసం ఖర్చు చెయ్యాల్సి వస్తుందన్న ఓ భావన్ని జీర్ణించుకుని ఆడ పిల్లలంటేనే యేహ్యాభావాన్ని ప్రకటిస్తున్నారంటే కొంతయినా అర్థం వుంది. కాని నువ్వు స్త్రీవమ్మా, స్త్రీ జాతికి నువ్వు ప్రతీకవు. అటువంటి నువ్వు ఆడ పిల్లల్ని యెందుకు అసహించుకుంటున్నావో నా వూహకి అందడంలేదమ్మా. భగవంతుడి కృపవల్ల మీకు ఆడపిల్ల పుట్టలేదు. పుట్టివుంటే యేం జేసేవారమ్మా? నాన్న, నిన్ను దోషిగా నిలబెట్టి నిన్ను, పిల్లని మీ అమ్మగారింట్లోనే విడిచిపెట్టేవారా? నీకు విడాకులిచ్చి మరో వివాహం చేసుకుని వుండేవారా నాన్న? అప్పుడు నువ్వెలా బాధపడి వుండేదానివమ్మా? ఒక్కసారి ఆలోచించు..."

ప్రశ్నల వర్షం కురిపించాడు గోపాలం.

తులశమ్మకి భైరవయ్యకి కొడుకు ప్రశ్నలు మింగుడు పళ్ళేదు. తులశమ్మకి చప్పున నోటమాట రాలేదు. అలాగని తన ఓటమిని అంగీకరించలేదు కూడా. భైరవయ్య మాత్రం కోపాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడు.

'ఒరేయ్ చేతగాని వెధవా ! మేం చెప్పినట్టు నడుచుకోక సన్నాసి కబుర్లు చెప్తున్నావా ? ఇప్పుడా వూహించుకోవడాలెందుకురా? మాకు ఆడ పిల్లలు వద్దనుకున్నాం... పుట్టలేదు. అంతే ! అది మా గొప్పదనంరా...' సగర్వంగా అన్నాడు భైరవయ్య.

గోపాలం అదోలా నవ్వేడు. 'అహ ! అలాగా? అది మీ గొప్పతనమా? మీరు దేవుళ్ళా యేవిఁటి ? జరిగిపోయాక అందరూ యిలాగే గొప్పలు చెబుతారు' వెటకారంగా అన్నాడు గోపాలం.

'వాదన అనవసరంరా అబ్బాయ్. ప్రస్తుత పరిస్థితిలో రెండు సార్లూ ఆడ పిల్లల్నే కన్న సునందని దోషిగా యెంచుతున్నాం. అందుకే శిక్ష విధించుతున్నాం" అన్నాడు భైరవయ్య.

"ఇందులో ఆమె తప్పేముంది నాన్నా? ఆ మాటకొస్తే సునందతో పాటు నేనూ బాధ్యుణ్ణేకదా?"

"నువ్వు మగాడివిరా! నింద భరించాల్సింది యెప్పుడూ ఆడదే. అది గుర్తుంచుకో" కటువుగా అన్నాడు భైరవయ్య.

"ఇది చాలా అన్యాయం నాన్న !" అన్నాడు గోపాలం చివరి ప్రయత్నంగా.

తులశమ్మ అందుకుంది.

'అన్యాయమేమీ కాదురా. న్యాయమే! న్యాయబద్ధంగా మేమొక తీర్పునిస్తున్నాం. ఏవిఁటో తెలుసా? మీ ఆవిణ్ణి, పిల్లలిద్దర్ని మనింటికి తీసుకురావడం మరి జరగదు. అదే ఆమెకు శిక్ష" అంది తులశమ్మ. "ఔన్రా! అదే మా నిర్ణయం! మా నిర్ణయానికి తిరుగులేదు" బల్లగుద్దినట్లు చెప్పాడు భైరవయ్య.

గోపాలం క్షణం మౌనంగా ఆలోచించాడు. తల్లిదండ్రుల మంకుపట్టుకి, చలనం వుండదనుకున్నాడు. ఇక తాను తలవంచకూడదని తీర్మానించుకున్నాడు. "మీ నిర్ణయానికి నేను కట్టుబడి వుండకపోతే?" తొణుకూ బెణుకూ లేకుండా ప్రశ్నించాడు గోపాలం.

ఆకాశం విరిగి నెత్తిమీద పడినట్టుగా నివ్వెరబోయాడు భైరవయ్య. అతని మొహం వివర్ణమయ్యింది. ఏనాడు తనని ఎదిరించని కొడుకు యిప్పుడిలా యెదరించడమేవిఁటి?... నమ్మలేక పోతున్నాడు.

"ఏవిట్రోయ్ యెప్పుడూ లేనిది యీరోజు యెదిరించి మరీ ప్రశ్నిస్తున్నావు ? ఎంత గుండె ధైర్యంరా?" అన్నాడు కోపంగా.

"అగ్నిసాక్షిగా నేను తాళికట్టిన అర్ధాంగిని నా మూలంగా జన్మించిన ఇద్దరు ఆడపిల్లల్ని మీరు నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తూ వుంటే, నా గుండెకి ధైర్యం రాక మౌనంగా వూరుకుంటుందా ? అదెప్పుడూ జరగదు నాన్నగారూ ! మీ నిర్ణయాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను." అన్నాడు గోపాలం దృఢ నిశ్చయంతో.

"ఆహా ! అంత గొప్పవాడివైపోయావన్న మాట ?" రుసరుసలాడుతూ అన్నాడు భైరవయ్య.

"గొప్పవాణ్ణేమీ కాదు. కాని నా ఆత్మగౌరవాన్ని, మానవత్వాన్ని నిలబెట్టుకుంటున్నాను"

"అలాగే ? అయితే యేం జరుగుతుందో తెలుసా"

" ఏం జరుగుతుంది ?"

"నా ఆస్తిలో చిల్లగవ్వ యివ్వను తెలిసిందా ?" గర్జించాడు భైరవయ్య.

గోపాలం తేలిగ్గా నవ్వేడు.

" వెధవాస్తి.. యెవడిక్కావాలి నాన్నా ఎంతోమంది కన్నీళ్ళ ఫలితంగా సంపాదించిన మీ ఆస్తి నా కొద్దు" నిబ్బరంగా చెప్పాడు.

కొడుకు అలా అంటాడని వూహించని భైరవయ్య షాక్ తిన్నాడు.

"అంతే కాదురా ! యీ యింట్లో కూడా నీకు స్థానం లేదు"

గోపాలం నవ్వేడు.

"ఆ నిర్ణయాన్ని నేనే ముందుగా తీసుకున్నాను నాన్నా ! మీలాంటి మానవత్వం లేని మనుష్యుల మధ్య నా పిల్లలు జీవించకూడదు. నేనూ పుష్కలంగా సంపాదించుకుంటున్నాను. స్వతంత్రంగా జీవించగలను. నాకు మేమందరం స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకునే అవకాశం యీ విధంగా దొరికి నందుకు నా కెంతో ఆనందంగా వుంది. గుడ్ బై ! వస్తానమ్మా " అంటూ లోపలికి వెళ్ళి సూట్‌కేసు, బ్యాగుతో వచ్చి బైటకి నడిచాడు గోపాలం.

భైరవయ్య, తులశమ్మ అచేతనంగా వుండిపోయారు. వాళ్ళు వూహించని తిరుగుబాటది!

□□□

(ఈనాడు ఆదివారం 12-3-95)